నమస్తే తెలంగాణ

# సూర్యాపేట

5 | నల్లగొండ, మంగళవారం 28 మే 2024 | SURYAPET



ఆత్మకూర్(ఎస్) పోలింగ్ కేంద్రంలో బారులుదీరిన ఓటర్లు

# ఓటెత్తిన పట్టభద్రులు



పెద్దవూరలో ఓటు వేసేందుకు బారులుదీరిన పట్టభద్రులు

## ప్రశాంతంగా నల్లగొండ-ఖమ్మం-వరంగల్ గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

- సాయంత్రం 4 గంటలకు వరకు 68.65 శాతం పోలింగ్
- తొలి రెండు గంటల్లో మందకొడిగా పోలింగ్
- 10 గంటల నుంచి వెల్లువలా తరలొచ్చిన ఓటర్లు
- చాలా చోట్ల సాయంత్రం 6గంటల వరకు కొనసాగిన పోలింగ్
- తుది పోలింగ్ శాతం నేడు వెల్లడి
- పెరిగిన పోలింగ్‌తో లాభనష్టాల బేరీజులో అభ్యర్థులు
- అన్నిచోట్ల నుంచి 'నల్లగొండ'కే బ్యాలెట్ బాక్సులు
- దుప్పలపల్లి స్టేట్ వేర్ హౌసింగ్ గోదాంల్లో స్ట్రాంగ్‌రూమ్స్‌లో భద్రత
- ఈ నెల 5న నల్లగొండలోనే కౌంటింగ్



నల్లగొండ బోయవాడ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులుదీరిన పట్టభద్రులు

**ఓట్లైతే నమోదు చేసుకున్నారు కానీ.. ఉప ఎన్నిక కావడంతో పట్టభద్రులు ఓటింగ్‌పై ఆసక్తి చూపుతారా లేదా అన్న సంశయానికి తెరదించుతూ భారీగా తరలివచ్చారు. సాధారణ ఎన్నికలను తలపిస్తూ పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారు. సోమవారం జరిగిన వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికల్లో భారీగా పోలింగ్ నమోదైంది. ఉదయం ఎనిమిది గంటలకు మందకొడిగా మొదలైన పోలింగ్ కొన్ని చోట్ల రాత్రి ఆరు గంటల వరకు కొనసాగింది. పట్టణ ప్రాంతాల్లోని ఎక్కువ పోలింగ్ బూతులు సాయంత్రం వరకు ఓటర్లతో నిండి ఉన్నాయి. సాయంత్రం 4గంటల వరకు 68.65శాతం పోలింగ్ నమోదైంది. తుది పోలింగ్ శాతం మంగళవారం వెల్లడించనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా 2021 ఎన్నికల్లో అంతకుముందు ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా 76.41శాతం ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ కేంద్రాల్లో ఎక్కువ చోట్ల బీఆర్‌ఎస్ ట్రెండ్ స్పష్టంగా వెల్లడైంది. గ్రామీణ, పట్టణ అనే తేడా లేకుండా అన్నిచోట్లా మంచి స్పందన కనిపించింది. ఇదే సమయంలో కాంగ్రెస్ నేతలు ముందే కాడి పారేసిన చందంగా వ్యవహరించడం చర్చనీయాంశమైంది.**

– నల్లగొండ ప్రతినిధి, మే 27 (నమస్తే తెలంగాణ)

వరంగల్ –ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గంలో పట్టభద్రులు వెల్లువలా తమ ఓటు హక్కును వినియోగించేందుకు తరలివచ్చారు. ఉదయం 8గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా సాయంత్రం వరకు ఓటర్ల క్యూ కొనసాగింది. తొలి రెండు గంటల్లో కొంత మందకొడిగా అనిపించినా తర్వాత ఓటర్లు బారులు తీరారు. కానీ మధ్యాహ్నం సమయంలో భారీగా పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాలు ఓ వైపు పురుషులు, మరోవైపు మహిళల లైన్లతో కిక్కిరిసి కనిపించాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్‌ను ముగించాల్సి ఉంది. కానీ ఆ సమయానికి 80శాతానికి పైగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరి ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఒక్కో ఓటరు గంటకు పైగా లైన్‌లో వేచి చూసి ఓటు వేశారు. కొన్ని చోట్ల సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఓటర్లు సాయంత్రం ఆరు గంటల వరకు ఓపికగా లైన్‌లో నిల్చుని ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. వీరందరికీ టోకెన్లు ఇచ్చి పోలింగ్‌ను చివరి ఓటర్ వరకు కొనసాగించారు.

### తొలి రెండు గంటల్లో 11.34శాతమే పోలింగ్

సోమవారం జరిగిన పోలింగ్‌లో తొలి రెండు గంటల్లో పోలింగ్ శాతం కొంత తక్కువగా నమోదైంది. తర్వాత ఊపందుకుంది. చివరి రెండు గంటల్లోనే భారీగా ఓటర్లు తరలిరావడంతో సందడి కనిపించింది. ఉదయం 8గంటలకు పోలింగ్ మొదలు కాగా 10 గంటల వరకు నియోజకవర్గవ్యాప్తంగా 11.34 శాతం పోలింగ్ నమోదైంది. ఉమ్మడి జిల్లా వారీగా పరిశీలిస్తే నల్లగొండలో 9.95శాతం, సూర్యాపేట 11.32 శాతం, యాదాద్రి జిల్లాలో 11.26 శాతం నమోదైంది. ఈ పోలింగ్ విధానాన్ని చూస్తే అంతగా పోలింగ్ నమోదు అవుతుందా? లేదా? అన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. ఆ తర్వాత ఓటర్లు పోలింగ్ బూతులకు క్యూ కట్టారు. తర్వాత మధ్యాహ్న 12గంటల వరకు పరిశీలిస్తే నియోజకవర్గ వ్యాప్తంగా 29.30 శాతం నమోదైంది. నల్లగొండ జిల్లాలో 26.94శాతం, సూర్యాపేట 31.27శాతం, యాదాద్రి జిల్లాలో 27.71 శాతం పోలింగ్ నమోదైంది. తొలి అర్ధ సమయం నాలుగు గంటల్లో కేవలం 30 శాతానికి అటుఇటుగా పోలింగ్ కావడంతో చివరి నాలుగు గంటల్లో మరో 30శాతం అవుతుందేమోనని అంచనా వేశారు. కానీ మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల మధ్య నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. దాంతో రెండు గంటల్లోనే 20.23శాతం పోలింగ్ నమోదైంది. నియోజక వర్గ వ్యాప్తంగా చూస్తే 49.53 శాతం నమోదైంది. అంటే నల్లగొండ జిల్లాలో 47.44 శాతం, సూర్యాపేటలో 52.80 శాతం, యాదాద్రిలో 47.92శాతం ఓటింగ్ నమోదైంది. ఇక ఆ తర్వాత మిగిలింది చివరి రెండు గంటల సమయమే. ఆ సమయంలోనే మిగిలిన 50శాతం ఓటర్లలో ఎక్కువ మంది పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు.

### ఒక్కో ఓటుకు కనీసం రెండు నిమిషాలు

ఓటరు ఓటు వేసేందుకు కనీసం రెండు నిమిషాల నుంచి కొందరైతే ఐదారు నిమిషాలు కూడా సమయం తీసుకున్నారు. ఈ సారి కూడా అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో బ్యాలెట్ పేపర్ల సైజ్ పెద్దగా ఉంది. ఓటరు సంతకం చేశాక బ్యాలెట్ పేపర్‌ను జాగ్రత్తగా చించాల్సి వచ్చింది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా... పేపర్ చిరిగే ప్రమాదం ఉంది. దీంతో పాటు బ్యాలెట్ పేపర్‌ను నిలువుగా మూడు మడతలుగా చేశాక అడ్డంగా మరో మూడు మడతలుగా చేసి ఓటర్‌కు అందజేశారు. దీనికి కొంత అదనపు సమయం తీసుకుంది. ఓటరు దీన్ని విప్పి తిరిగి తాను అనుకున్న అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో ఓటు వేసేందుకు వారిని వెతుక్కోవడానికి కూడా మరికొంత సమయం పట్టింది. చివరగా ఓటు వేశాక మళ్లీ తిరిగి సేమ్ పద్ధతిలో బ్యాలెట్ పేపర్‌ను మడత చేసి పోలింగ్ బాక్స్‌లో వేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో కనీసం రెండు నుంచి ఐదు నిమిషాల సమయం తీసుకుంది. దాంతో ఓటర్లు ఎక్కువ సంఖ్యలో వచ్చినప్పుడు అదనపు సమయం వేచి చూడక తప్పలేదు. ఇది కూడా సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ కొనసాగడానికి కొంత కారణంగా కనిపించింది.

### చివరి రెండు గంటల్లో భారీగా పోలింగ్

మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఓటర్ల రాక ఒక్కసారిగా పెరిగింది. ఓ వైపు ఎండ ప్రభావం, ఉక్కపోత తీవ్రంగా ఉన్నా ఓటర్లు లెక్కచేయకుండా ఓటింగ్‌కు తరలివచ్చారు. పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే రకమైన పరిస్థితి కనిపించింది. రెండు గంటల నుంచి ఓటింగ్ కోసం వచ్చిన ఓటర్లు కనీసం గంటకు పైగా వేచి ఉండి ఓటు వేసి వెళ్లారు. ఆ తర్వాత వచ్చిన వారు చాలా సమయం క్యూలైన్లలో వేచి ఉండి ఓపికగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. సాయంత్రం 4గంటల వరకు నియోజకవర్గ వ్యాప్తంగా 68.65శాతం పోలింగ్ నమోదు కాగా నల్లగొండ జిల్లాలో 66.75శాతం, సూర్యాపేటలో 73.15 శాతం, యాదాద్రిలో 78.59శాతం అయ్యింది. ఆ తర్వాత కూడా భారీ సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరి ఉన్నారు. మొత్తంగా చివరి రెండు గంటల్లోనే ఎక్కువ పోలింగ్ జరిగినట్లు తెలుస్తున్నది. కాగా 2021 మార్చిలో జరిగిన పట్టభద్రుల ఎన్నికల్లో 76.41 శాతం పోలింగ్ నమోదైంది. ఇక 2015లో ఉమ్మడి జిల్లాగా ఉన్న నల్లగొండలో మొత్తం 58.97శాతం ఓట్లు పోలయ్యాయి.

### దుప్పలపల్లిలోని స్ట్రాంగ్ రూమ్స్‌కు బ్యాలెట్ బాక్స్‌లు

నల్లగొండ పట్టణ సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లి పరిధి స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లోనే కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. వచ్చే నెల 5వ తేదీన ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలు కానుంది. నియోజకవర్గ పరిధిలోని 12 జిల్లాల నుంచి పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులన్నీ నల్లగొండకే తరలిస్తున్నారు. వేర్ హౌసింగ్ గోదాముల్లో ఇందుకోసం ప్రత్యేకంగా స్ట్రాంగ్ రూమ్స్‌ను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ బాక్సెలన్నింటినీ ఇందులోనే భద్రపరుస్తున్నారు. ఇందుకోసం ముందే గుర్తించిన రూట్లలోనే ప్రత్యేక పోలీస్ ఎస్కార్ట్‌తో బాక్స్‌లను బస్సుల్లో తరలిస్తున్నారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి, జనగాం, వరంగల్‌రూరల్, అర్బన్, ఖమ్మం జిల్లాల బాక్స్‌లు అర్ధరాత్రి వరకే ఇక్కడికి చేరుకున్నాయి. ములుగు, భద్రాది కొత్తగూడెం, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల నుంచి మాత్రం అర్ధరాత్రి దాటిన తర్వాత రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక్కడికి వస్తున్న బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్ రూమ్స్‌లో భద్రపరిచే విధానాన్ని స్వయంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన పర్యవేక్షిస్తున్నారు. అభ్యర్థులు లేదా వారి ఏజెంట్ల సమక్షంలోనే వీటికి సీల్ వేస్తున్నట్లు ఆర్‌ఓ వెల్లడించారు. స్ట్రాంగ్ రూమ్స్ వద్ద ప్రత్యేక బలగాలతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### పూర్తి ప్రశాంతంగా ఓటింగ్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలింగ్ పూర్తి ప్రశాంతంగానే కొనసాగింది. ఉదయం నుంచి రాత్రి పోలింగ్ ముగిసే వరకు భారీ పోలీసు బందోబస్తు కూడా కొనసాగింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, తన ఆర్వో కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. జిల్లా ఎస్పీ చందనాదీప్తి పోలింగ్ స్టేషన్ల వారీగా బందోబస్తును పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల బయట కూడా ఆయా అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించినా ఎవరికీ వారే ప్రశాంతంగా ఉన్నారు. పోలింగ్‌కు వచ్చే ఓటర్లను మరోసారి ఓట్లను అభ్యర్థిస్తూ కనిపించారు. ఇక నార్కట్‌పల్లిలో కాంగ్రెస్ నేతలు ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని ఆరోపిస్తూ స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌గౌడ్ ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ కార్యకర్తలకు అశోక్‌గౌడ్‌కు వాగ్వివాదం జరుగడంతో దాడికి యత్నించారు. దాంతో అశోక్ పోలీస్‌స్టేషన్ ముందు ధర్నాకు దిగారు. ఇది మినహా అన్ని చోట్లా ప్రశాంతంగా పోలింగ్ కొనసాగింది. ప్రత్యేక మొబైల్ టీమ్‌లు నిరంతరం ఆయా రూట్లలో బందోబస్తు విధులు నిర్వహించారు. పోలింగ్ పూర్తి ప్రశాంతంగా ముగిసినట్లు ఆర్‌ఓ హరిచందనతో పాటు ఎస్పీ చందనాదీప్తి ప్రకటించారు. ప్రశాంత పోలింగ్‌కు సహకరించిన అభ్యర్థులు, ఓటర్లకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# బీఆర్ఎస్ అభ్యర్థివైపే పట్టభద్రులు

- ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో రాకేశ్‌రెడ్డికే మెజారిటీ
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, మే 27 (నమస్తే తెలంగాణ) : ఖమ్మం–నల్లగొండ–వరంగల్ నియోజకవర్గ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి టాప్ ప్లేస్‌లో ఉన్నారని, పట్టభద్రులు మూకుమ్మడిగా ఆయనకే ఓటు వేసి పట్టం కట్టబోతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యుడు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 457వ పోలింగ్ బూత్‌లో 673 మంది ఓటర్లు ఉండగా ఉదయం ఎనిమిది గంటలకే ఆయన మొదటి ఓటును వినియోగించుకొని యువతకు ఆదర్శంగా నిలిచారు. అనంతరం మీడియాతో జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కొద్ది రోజులుగా జరిగిన ప్రచారాల్లో పట్టభద్రులైన ఓటర్లు ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకున్నారని తెలిపారు. బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడే కాంగ్రెస్ అభ్యర్థిని, ప్రజల్లో కనిపించని బీజేపీ అభ్యర్థిని కాదనుకున్నారని చెప్పారు. ఉన్నత చదువులు చదివి సమాజ సేవ కోసం రాజకీయాల్లోకి వచ్చిన రాకేశ్‌రెడ్డిని గెలిపించుకునేందుకు పట్టభద్రులైన యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు, పింఛన్‌దారులు పెద్దఎత్తున పోలింగ్ బూత్‌లకు వచ్చారని తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి నిదర్శనమని, ఓటు వేయకపోవడం మనల్ని మనం మోసం చేసుకోవడమేనని అన్నారు.



సూర్యాపేటలో ఓటు వేస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

# పోలింగ్ సరళిలో బీఆర్ఎస్ ట్రెండ్

- రాకేశ్‌రెడ్డి వైపే ఓటర్ల మొగ్గు
- ఇతర అభ్యర్థుల నుంచి 2వ ప్రాధాన్యత ఓట్లు సైతం భారీగానే..
- కాంగ్రెస్‌లో కనిపించని అధికార పార్టీ ఉత్సాహం
- పోలింగ్ రోజున కాంగ్రెస్ కీలక నేతల జాడేది?
- విజయంపై సంపూర్ణ విశ్వాసం : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, మే27(నమస్తే తెలంగాణ) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ సరళిలో బీఆర్‌ఎస్ ట్రెండ్ స్పష్టంగా కనిపించింది. గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ ప్రాంతాల్లో సైతం బీఆర్‌ఎస్ ప్రభావం వెల్లడైంది. పోలింగ్ ప్రారంభం నుంచి చివరి వరకు పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితి, ఓటర్ల నాడిని బట్టి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికే మొదటి ప్రాధాన్యత ఓట్లు ఎక్కువగా పడినట్లు తెలుస్తున్నది. ఈ ఎన్నికల విషయంలో అభ్యర్థి ఎంపిక నుంచి మొదలు పెడితే చివరలో పోల్ మేనేజ్‌మెంట్ వరకు బీఆర్‌ఎస్ పకడ్బందీగా వ్యవహరించింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాల్లో పాల్గొనడంతోపాటు బరిలో ఉన్న ప్రధాన అభ్యర్థుల్లో రాకేశ్‌రెడ్డి గుణగణాలు, అర్హతలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సక్సెస్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను, ప్రస్తుత మోసాలను వివరించడంతోపాటు కేసీఆర్ ప్రభుత్వ పథకాలను మరోసారి గుర్తుచేయడం, అభ్యర్థులందరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎలా మెరుగైనవాడో వివరించడంతో మంచి స్పందన లభించింది. 'బిట్స్ ఫిలానీ కావాలా... పల్లీ బఠానీ కావాలా' అని కేటీఆర్ సంధించిన అస్త్రం పట్టభద్రులను ఆలోచనల్లో పడేసింది. ఇక ఉమ్మడి జిల్లా పరిధిలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పార్టీ మాజీ ఎమ్మెల్యేలతో పాటు ఇతర ముఖ్యులందరినీ సమన్వయం చేస్తూ అవిశ్రాంతంగా పర్యటించారు. నియోజకవర్గాల వారీగా పలుమార్లు సమావేశాల్లో పాల్గొని దిశానిర్దేశం చేయడంతో పార్టీ నేతలు, శ్రేణులు క్షేత్రస్థాయి వరకు ఉత్సాహంగా పనిచేశారు. పోలింగ్ రోజు సోమవారం కూడా దాదాపు ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రధాన పట్టణాల్లో పర్యటిస్తూ పోలింగ్ కేంద్రాల వద్ద పార్టీ శ్రేణులతో మమేకమయ్యారు. పోలింగ్ సరళిని పరిశీలిస్తూ, అన్నిచోట్ల బీఆర్‌ఎస్‌కు మంచి ఆదరణ ఉందని, మరోసారి గులాబీ జెండా ఎగురవేస్తామని జగదీశ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వీటన్నింటి రీత్యా చివరి వరకు బీఆర్‌ఎస్ శ్రేణుల శ్రమను ప్రతిబింబిస్తూ పోలింగ్ సరళిలో గులాబీ ట్రెండ్ స్పష్టంగా కనిపించింది. ప్రథమ ప్రాధాన్యత ఓట్లు ఎక్కువగా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికే పడినట్లుగా తెలుస్తున్నది. ఉప ఎన్నికల్లో కష్టపడి పనిచేసి ఓటర్లను కలిసి బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేసిన ఉమ్మడి నల్లగొండ జిల్లా పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

### కాడెత్తేసిన కాంగ్రెస్ కీలక నేతలు

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఆది నుంచే కుడితిలో పడ్డ ఎలుక మాదిరిగా ఉందన్న చర్చ మొదలైంది. పార్టీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న ఎంపిక నాటి నుంచే మెజార్టీ నేతలు పెదవి విరిచినట్లే ఉన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ మంత్రులైన కోమటిరెడ్డిని, ఉత్తమ్‌తో పాటు ఇతర కీలక నేతలందరినీ తీన్మార్ మల్లన్న ఏదో ఒక కారణంతో గతంలో ఇష్టారీతిన తన చానల్ వేదికగా దూషించారన్నది నిజం. ఈ నేపథ్యంలో వీరితో పాటు వీరి అనుచరులెవరూ మల్లన్న అభ్యర్థిత్వాన్ని మనస్ఫూర్తిగా అంగీకరించిన పరిస్థితి లేదు. ఈ ఉప ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ ముఖ్యులను తీన్మార్ మల్లన్న దూషించే వీడియోలన్నీ సోషల్ మీడియాలో మరోసారి వైరల్‌గా మారడంతో పుండు మీద కారం చల్లినట్లైంది. వీటన్నింటికీ తోడు ప్రచారంలో సైతం మల్లన్న అభ్యర్థిత్వం పట్ల ఓటర్ల నుంచి సానుకూలత లభించలేదు. దాంతో ఏదో పార్టీ ప్రకటించింది కాబట్టి పైపైన ప్రచారం కానిచ్చినట్లు చేశారు. పోలింగ్ రోజున కూడా కేంద్రాల వద్ద కాంగ్రెస్‌లో అధికార పార్టీ ఉత్సాహం కనపడలేదు. ఇక మల్లన్నకు మద్దతుగా ప్రచారానికి దూరంగా ఉన్న కోమటిరెడ్డి సోదరులు పోలింగ్‌కు రెండు రోజుల ముందే విదేశాలకు వెళ్లిపోయారు. మంత్రి ఉత్తమ్ కూడా హైదరాబాద్‌కే పరిమితమయ్యారు. ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి ఇటువైపు రాలేదు. ఇలా కీలక నేతలు అంటీముట్టనట్లుగా ఉండడంతో పార్టీ శ్రేణులు కూడా అలాగే వ్యవహరించాయన్నది నిజం. దాంతో పోలింగ్‌కు ముందే కాంగ్రెస్ పార్టీ కాడెత్తిసినట్లు విస్తృత ప్రచారం సాగడంతో బీఆర్‌ఎస్‌కు మరింత సానుకూల వాతావరణం ఏర్పడడానికి తోడ్పడిందన్న చర్చ కొనసాగింది. ఇవన్నీ ఎలా ఉన్నా ఫైనల్‌గా వచ్చే నెల 5 నుంచి కొనసాగే ఓట్ల లెక్కింపుపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

**పోలింగ్ వివరాలు సాయంత్రం నాలుగు గంటల వరకు**

| జిల్లా | పోలింగ్ స్టేషన్లు | ఓటర్లు | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|---|
| సిద్దిపేట | 5 | 4,679 | 3267 | 69.82 |
| జనగాం | 27 | 23,419 | 16,767 | 71.60 |
| హనుమకొండ | 67 | 43,729 | 31,141 | 71.21 |
| వరంగల్ | 59 | 43,812 | 31,036 | 70.84 |
| మహబూబాబాద్ | 36 | 34 933 | 24,285 | 69.52 |
| ములుగు | 17 | 10,299 | 7,677 | 74.54 |
| భూపాలపల్లి | 16 | 12,535 | 8,669 | 69.16 |
| భద్రాద్రి కొత్తగూడెం | 55 | 40,106 | 27,294 | 68.05 |
| ఖమ్మం | 118 | 83,879 | 54,973 | 65.54 |
| యాదాద్రి భువనగిరి | 37 | 34,080 | 26,785 | 78.59 |
| సూర్యాపేట | 71 | 51,497 | 36,367 | 73.15 |
| నల్లగొండ | 97 | 80,871 | 53,981 | 66.75 |
| మొత్తం | 605 | 4,63,839 | 3,18,445 | 68.65 |



బ్యాలెట్ బాక్సులను నల్లగొండ స్ట్రాంగ్ రూమ్‌కు తీసుకొచ్చిన సిబ్బంది



దేవరకొండలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



తిరుమలగిరిలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్, కమల దంపతులు



మిర్యాలగూడలో తనయుడు సిద్ధార్థతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



నకిరేకల్‌లో ఓటు వేసిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, పుష్ప దంపతులు



హాలియాలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



తిరుమలగిరి(సాగర్)లో ఎమ్మెల్సీ కోటిరెడ్డి



నల్లగొండలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



తుంగతుర్తిలో సూర్యాపేట జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్‌రావు దంపతులు



నల్లగొండలో కలెక్టర్ హరిచందన



సూర్యాపేటలో కలెక్టర్ వెంకట్రావు



తుర్కపల్లిలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న దంపతులు



నల్లగొండలో ఓటు వేసిన స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్ కుమార్



మఠంపల్లిలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే శాంపూడి సైదిరెడ్డి